సాక్షి
జయశంకర్ భూపాలపల్లి

బుధవారం | 18 | డిసెంబర్ | 2024



దర్శానాయక్‌కు ఘన నివాళి

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు దర్శానాయక్ అంత్యక్రియలు దేవరుప్పల మండలం పడమటితండాలో మంగళవారం ముగిశాయి. - 8లో▸



రయ్..రయ్

వరంగల్ రీజియన్ పరిధిలోని రోడ్లపై ఎలక్ట్రిక్ బస్సులు పరుగెత్తనున్నాయి. ఈ మేరకు ఆర్టీసీ అధికారులు అవసరమైన ఏర్పాట్లను పూర్తి చేశారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
28.1°/16.3°

వాతావరణం

జిల్లాలో ఉదయం మంచు కురుస్తుంది. మధ్యాహ్నం కాస్త ఎండ తీవ్రత ఉంటుంది. రాత్రివేళ చలిగా ఉంటుంది.

న్యూస్‌రీల్

మారుపేర్ల సమస్యను పరిష్కరించాలి



భూపాలపల్లి అర్బన్: సింగరేణి కార్మికులకు ఎన్నికల సమయంలో యూనియన్ నాయకులు ఇచ్చిన హామీ ప్రకారం మారుపేరుల సమస్యను పరిష్కరించాలని సీఐటీయూ బ్రాంచి కార్యదర్శి కంపేటి రాజయ్య డిమాండ్ చేశారు. ఏరియాలోని కేటీకే 6వ గనిలో మంగళవారం కార్మికులతో సంతకాల సేకరణ చేపట్టారు. ఎన్నికల్లో గెలుపొందిన నాటి నుంచి మభ్య పెడుతూ కార్మికులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. ప్రస్తుతం అసెంబ్లీ ఎన్నికల్లో ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు మారుపేరుల సమస్యపై చర్చించి పరిష్కరించాలని కోరారు. కార్మికుల సమస్యలపై చేపట్టిన సంతకాల సేకరణ కాపీలను ముఖ్యమంత్రి, సింగరేణి సీఎండీలకు అందజేయనున్నట్లు తెలిపారు.

ధాన్యం కొనుగోళ్లలో వేగంపెంచాలి



కాటారం: పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొనుగోళ్లు వేగవంతంగా చేపట్టాలని జిల్లా సహకార అధికారి వాల్యానాయక్, సివిల్ సప్లయీస్ డీఎం రాములు కేంద్రాల ఇన్‌చార్జ్‌లను ఆదేశించారు. కాటారం మండలం కొత్తపల్లి, గారెపల్లి, ధన్వాడ, శంకరాంపల్లి కొనుగోలు కేంద్రాలను మంగళవారం డీసీఓ, డీఎం తనిఖీ చేశారు. కొనుగోళ్ల ప్రక్రియ, ఇప్పటివరకు కొనుగోలు చేసిన ధాన్యం, రవాణా కేంద్రాల్లో ధాన్యం నిల్వ, సౌకర్యాలు తదితర అంశాలపై అధికారులు ఆరాతీశారు. కాంటాల్లో జాప్యం వహించకుండా నిబంధనలకు అనుగుణంగా తేమ కలిగిఉన్న ధాన్యాన్ని వెంటనే కాంటాలు వేయాలని తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెనువెంటనే కేటాయించిన మిల్లులకు రవాణా జరిగేలా చూసుకోవాలన్నారు. రైతులకు ఇబ్బందులు కలుగకుండా కొనుగోళ్లు సక్రమంగా చేపట్టాలని పేర్కొన్నారు. అధికారుల వెంట పీఏసీఎస్ సీఈఓ ఎర్ల సతీశ్‌కుమార్, సెంటర్ ఇన్‌చార్జ్‌లు, రైతులు ఉన్నారు.

కొడవటంచ హుండీ ఆదాయం రూ.8.92లక్షలు



రేగొండ: మండలంలోని కొడవటంచ శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఆలయ హుండీ ఆదాయం రూ.8లక్షల 92వేలు వచ్చినట్లు ఆలయ ఈఓ బిల్లా శ్రీనివాస్ తెలిపారు. దేవాదాయ శాఖ పర్యవేక్షణ అధికారి కవిత ఆధ్వర్యంలో మంగళవారం ఆలయంలో హుండీలను లెక్కించారు. నాలుగు నెలలకు రూ.8,92,021 వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అమూల్య, అర్చకులు బుచ్చమాచార్యులు, శ్రీనివాసచార్యులు, ఆలయ సిబ్బంది శ్రావణ్, సుధాకర్, రాజు, గ్రామస్తులు డోబిలి కోటి, పబ్బ సమ్మయ్య, కోలుగూరి సంపత్‌రావు, మోరే మొగిళి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మోకాళ్లపై కూర్చొని నిరసన



భూపాలపల్లి అర్బన్: తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సమగ్ర శిక్ష కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు చేపడుతున్న సమ్మెలో భాగంగా మంగళవారం కలెక్టరేట్ ఎదుట మోకాళ్లపై కూర్చొని నిరసన చేపట్టారు. 18 సంవత్సరాలు వివిధ విభాగాల్లో విధులు నిర్వర్తిస్తున్నప్పటికీ ప్రభుత్వాలు తమను గుర్తించడం లేదని, చాలీచాలని వేతనాలతో విధులు నిర్వర్తిస్తున్నామని యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చాంద్‌పాషా, తోకల వేణు తెలిపారు. వీరి దీక్షలకు డీటీఎఫ్ జిల్లా నాయకులు రామణారెడ్డి, తిరుపతి సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు చల్ల సునీత, మహేందర్, సుదర్శన్, చంద్రకళ, తిరుపతి, రాజు, నరేష్, కనకలక్ష్మి పాల్గొన్నారు.

కటిక చీకటి..
వణికించే చలి..

జిల్లాలో కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదు

- బయటకు వచ్చేందుకు జంకుతున్న జనం
- రాత్రివేళ పలు శాఖల ఉద్యోగులు, కార్మికుల విధి నిర్వహణ
- కాళేశ్వరానికి భక్తుల రాకపోకలు అంతంతే
- చలి తీవ్రతపై 'సాక్షి' నైట్ విజిట్

భూపాలపల్లి: మునుపెన్నడూ లేని విధంగా చలి తీవ్రత ప్రజలను తీవ్ర ఇబ్బందికి గురి చేస్తోంది. గడిచిన మూడు రోజులుగా జిల్లాలో 15 డిగ్రీల లోపు ఉష్ణోగ్రత నమోదవుతోంది. ఫలితంగా సాయంత్రం ఆరు గంటల నుంచి తెల్లవారుజామున ఏడు గంటల వరకు వచ్చేందుకు జనం జంకుతున్నారు. పగటి పూటనే తమ పనులను పూర్తి చేసుకొని సాయంత్రానికి ఇళ్లకు చేరుకుంటున్నారు. రాత్రిపూట ప్రయాణాలను సైతం వాయిదా వేసుకుంటున్నారు. చలి తీవ్రత ఎక్కువగా ఉండటంతో రాత్రిపూట ఫాస్ట్‌ఫుడ్, టిఫిన్ సెంటర్లు, బేకరీలు, రెస్టారెంట్లలో ఎవరూ కనిపించడం లేదు. సింగరేణి కార్మికులు, మున్సిపాలిటీ పారిశుద్ధ్య కార్మికులు, పెట్రోలింగ్ పోలీసులు విధులు నిర్వర్తించేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నైట్ షిఫ్ట్ చేసే సింగరేణి కార్మికులు ముందుగానే గనుల వద్దకు చేరుకుంటున్నారు. ప్రజలు సైతం చలిని తట్టుకోలేక చలిమంటలు కాగుతున్నారు.

అంబేడ్కర్ చౌరస్తాలో విధులు నిర్వర్తిస్తున్న పోలీసులు



పెట్రోలింగ్‌లో చలికి గజగజ

రాత్రి 11.30 గంటలు

- రాత్రి విధులు నిర్వర్తించే పోలీస్ పెట్రోలింగ్ సిబ్బంది చలికి గజగజ వణుకుతున్నారు. స్వెటర్‌లు, మంకీ క్యాప్‌లు ధరించినప్పటికీ చలికి తట్టుకోలేక కారు అద్దాలు ఎక్కించుకొని పట్టణంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు.

నిద్రపోతున్న వేళ

- అందరూ నిద్రపోతున్న వేళ పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు మున్సిపల్ కార్మికులు చలిలోనూ విధులు నిర్వర్తిస్తున్నారు. కొందరు స్వెటర్లు వేసుకొని రాగా మరి కొంతమంది పేదలు చద్దర్లు, టవల్స్ కప్పుకొని తెల్లవారుజామున 4.30 గంటలకే అంబేడ్కర్ చౌరస్తా వద్దకు వచ్చి విధులకు హాజరై రోడ్లను శుభ్రంచేయడం ప్రారంభించారు.

తెల్లవారుజాము 4.30 గంటలకు అటెండెన్స్ తీసుకుంటున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ నవీన్



కాళేశ్వరానికి తగ్గిన భక్తులు..

రాత్రి 12 గంటలు..

- చలి తీవ్రత కారణంగా శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయానికి భక్తుల రాకపోకలు తగ్గాయి. సాధారణంగా వివిధ ప్రాంతాల నుంచి వందలాది మంది భక్తులు రాత్రి వరకు కాళేశ్వరానికి చేరుకొని బస చేసి ఉదయాన్నే గోదావరి నదిలో స్నానం చేసి పూజలు చేస్తుంటారు. గడిచిన మూడు రోజులు పదుల సంఖ్యలో కూడా భక్తులు రావడం లేదు. వచ్చిన భక్తులు సైతం చలిని తట్టుకునేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



రాత్రి 12 గంటలకు కాళేశ్వరాలయం తూర్పు రాజగోపురం వద్ద నిద్రిస్తున్న భక్తులు

చలిమంటలు..

రాత్రి 12 గంటలు..

- భూపాలపల్లి కాలనీల్లో ఎక్కడ చూసినా చలి మంట కాచుకుంటూ కనిపిస్తున్నాయి. సాధారణంగా చలికాలంలో రాత్రి 8 గంటల తరువాత అందరూ నిద్రకు ఉపక్రమిస్తారు. కానీ ప్రస్తుత చలిని తట్టుకోలేక బయటకు వచ్చి రాత్రి 12 గంటల వరకు చలి మంటలు కాగి ఇళ్లకు వెళ్తున్నారు.



రాత్రి 12 గంటలకు పట్టణంలోని సుభాష్‌కాలనీలో చలి కాగుతున్న ప్రజలు

రోగుల సేవలో..



రాత్రి 12:10 గంటలు

- 24 గంటలు అందుబాటులో ఉండే ఆస్పత్రులు, మెడికల్ స్టోర్‌ల లోని సిబ్బంది సైతం చలికి ఇబ్బంది పడుతున్నారు. ఎప్పుడు ఏ పేషెంట్ వస్తాడోనని చలిని తట్టుకుంటూ కూర్చుంటున్నారు.

ఇదేం చలిరా బాబు..

- ప్రైవేట్ వాహనాల్లో వెళ్లే వారు చలికి మార్గమధ్యలో టీ తాగుతున్నారు. రాత్రి టీ కొట్టు కనబడగానే వెళ్లి వేడి వేడి టీ తాగుతూ.. ఇదేం చలిరా బాబు.. తట్టుకోలేకపోతున్నాం అంటున్నారు.

రాత్రి 12:15 గంటలు



చద్దర్లు కప్పుకుని పనులు..



రాత్రి ఒంటి గంటకు..

- లారీల్లో బొగ్గు లోడింగ్, అన్‌లోడింగ్ చేసే కార్మికులు చలికి గజగజ వణుకుతూ విధులు నిర్వర్తిస్తున్నారు. రాత్రి 12 గంటల వరకు నిద్రపోయి, అనంతరం లారీలు రాగానే చద్దర్లు కప్పుకొని లారీలు ఎక్కి పనులు చేస్తున్నారు.

చలిని లెక్కచేయకుండా..

- కూరగాయల మార్కెట్‌లో హమాలీలు చలిని సైతం లెక్కచేయకుండా పనులు చేస్తున్నారు. పట్టణంలోని మార్కెట్‌కు ఉదయం నాలుగు గంటలకు కూరగాయల లోడ్‌లు రాగా హుషారుగా ఒకరినొకరు మాట్లాడుకుంటూ సంచులు దింపుతున్నారు. వ్యాపారులు సైతం వచ్చి తమకు కావాల్సిన కూరగాయలు కొనుగోలు చేస్తున్నారు.

తెల్లవారుజామున నాలుగు గంటలకు..



రెండో రోజు సీఎం కప్ క్రీడలు



కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

భూపాలపల్లి రూరల్: జిల్లాకేంద్రంలోని అంబేడ్కర్ మైదానంలో జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం రోజు సీఎం కప్ జిల్లా స్థాయి క్రీడలు ముమ్మరంగా కొనసాగాయి. రెండో రోజు బాల బాలికలకు వాలీబాల్, కబడ్డీ, ఖోఖో అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, చెస్, హాకీ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీవైఎస్‌ఓ చిర్ర రఘు మాట్లాడుతూ.. గ్రామీణ స్థాయిలోని క్రీడాకారుల ప్రతిభను వెలికి తీసేందుకు ప్రతీ ఏటా రాష్ట్ర ప్రభుత్వం సీఎం కప్ క్రీడలను నిర్వహిస్తుందన్నారు. దీనిలో భాగంగానే రెండు రోజులుగా అంబేడ్కర్ క్రీడా మైదానంలో జిల్లాస్థాయి సీఎం క్రీడలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఆయా మండలాల నుంచి వచ్చిన క్రీడాకారులకు ఇబ్బందులు కలగకుండా సకల సౌకర్యాలు కల్పించామని చెప్పారు. జిల్లాస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఎంపిక చేసి రాష్ట్రస్థాయిలో నిర్వహించే సీఎం కప్ క్రీడల్లో పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో డీవైఎస్ కార్యాలయ సిబ్బంది సాగర్, జిల్లాలోని పీఈటీలు రమేష్, రాజన్న, సాంబమూర్తి, నిరుపటి అజయ్ పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ కళాశాలగా కాటారం పాలిటెక్నిక్

కాటారం: మండలంలోని కొత్తపల్లి సమీపం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఇంజనీరింగ్ కళాశాలగా అప్‌గ్రేడ్ కానుంది. ఇంజనీరింగ్ కళాశాలగా మార్పు చేసే దిశగా ప్రతిపాదనలు సిద్ధమైనట్లు తెలిసింది. కాటారం ప్రాంతంలో ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు చేయాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు యోచనలో ఉన్నారు. ఇందులో భాగంగా కాటారం పాలిటెక్నిక్ కళాశాలను ఇంజనీరింగ్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేయాలని ఇటీవల ప్రభుత్వానికి ప్రతిపాదించారు. దీంతో టెక్నికల్ ఎడ్యుకేషన్ కమిషనర్ శ్రీదేవసేన కళాశాల అప్‌గ్రేడేషన్ అనుమతుల కోసం ఇటీవల టెక్నికల్ హైయ్యర్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీకి నివేదిక పంపించినట్లు తెలిసింది. అప్‌గ్రేడేషన్ అనుమతుల కోసం కావాల్సిన వివరాలను నివేదికలో పొందుపర్చినట్లు సమాచారం. ప్రభుత్వ అనుమతి లభిస్తే 2025–26 సంవత్సరంలో ఇంజనీరింగ్ కళాశాలలో అడ్మిషన్ ప్రక్రియ ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నాయి. ఈ విషయమై పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్‌ను వివరణ కోరగా ఇంజనీరింగ్ కళాశాలగా అప్‌గ్రేడేషన్ అనుమతుల కోసం ప్రతిపాదనల ప్రక్రియ కొనసాగుతున్న విషయం వాస్తవమే అన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

కలెక్టర్ రాహుల్ శర్మ

చిట్యాల: విద్యార్థుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని కలెక్టర్ రాహుల్ శర్మ కోరారు. మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల/కళాశాలను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో ఒడితల పీహెచ్‌సీ వైద్యులు హెల్త్‌క్యాంపు నిర్వహించారు. ఆకస్మికంగా తనిఖీకి వచ్చిన కలెక్టర్ వైద్య సిబ్బందితో మాట్లాడారు. విద్యార్థినుల ఆరోగ్యం పట్ల వైద్యులు శ్రద్ధ వహించాలని సూచించారు. విద్యార్థులు చలికాలంలో పరిశుభ్రతను పాటించి ఆరోగ్యంపై జాగ్రత్తగా ఉండాలని అన్నారు. పాఠశాలలో నూతనంగా ఏర్పాటుచేసిన మెనూ, వంట గది, వంట సరుకులను పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల కామన్ డైట్ చార్జీలను పెంచిన తరుణంలో కామన్ డైట్‌ను పక్కాగా అమలు చేయాలని ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు. విద్యార్థులు చదువుతో పాటు ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా ఉండాలని చెప్పారు. పాఠశాలలోని సౌకర్యాలపై కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేసి ప్రిన్సిపాల్‌ను అభినందించారు.

కలెక్టర్ దృష్టికి సమస్యలు..



పిచ్చి మొక్కలను పరిశీలిస్తున్న కలెక్టర్

పాఠశాల సమస్యలను కలెక్టర్ రాహుల్‌శర్మకు ప్రిన్సిపాల్ భిక్షపతి వివరించారు. బండరాళ్లు, పిచ్చి మొక్కలను తొలగించేందుకు చర్యలు చేపడుతామని కలెక్టర్ చెప్పారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, ఆర్డీఓ మంగీలాల్, తహసీల్దార్ హేమ, ఎంపీడీఓ జయశ్రీ, ఎంపీఓ రామకృష్ణ, ఆర్‌ఐ రాజు, ప్రిన్సిపాల్ గోల్కొండ భిక్షపతి, పంచాయతీ కార్యదర్శి రవికుమార్ పాల్గొన్నారు.



పాఠశాలలో వంటను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్ శర్మ

కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి

చిట్యాల: రానున్న ఎన్నికలలో బీజేపీ కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని ఆ పార్టీ జిల్లా ఎన్నికల అధికారి కడగంటి రమేష్ కోరారు. మండలకేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు బుర్ర వెంకటేష్‌గౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రమేష్ హాజరై మాట్లాడారు. బీజేపీకి గ్రామీణస్థాయి నుంచి ఆదరణ పెరుగుతోందన్నారు. వచ్చే స్థానిక ఎన్నికలలో అత్యధిక స్థానాలలో గెలుపొందే విధంగా కార్యకర్తలు పనిచేయాలని కోరారు. బూత్ కమిటీలను ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా సభ్యత్వ నమోదు ప్రముఖ్ జన్నె మొగిలి, మండల ప్రధాన కార్యదర్శి మాచర్ల రఘు, బీజేవైఎం మండల అధ్యక్షుడు మైదం శ్రీకాంత్, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు రాయిని శ్రీనివాస్, ఓబీసీ జిల్లా కార్యదర్శి వోల్లాల ప్రవీణ్, నాయకులు పాల్గొన్నారు.



22న కాకతీ కదనభేరి

భూపాలపల్లి అర్బన్: ఈనెల 22న వరంగల్‌లో జరగనున్న సీపీఎస్ ఉద్యోగుల కాకతీ కదన భేరి సభను విజయవంతం చేయాలని రాష్ట్ర కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయీస్ యూనియన్ (సీపీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు స్థిత ప్రజ్ఞ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్వల్ శ్రీకాంత్ పిలుపునిచ్చారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎండీ దిల్షాద్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం కాకతీ కదనభేరి పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్థిత ప్రజ్ఞ మాట్లాడుతూ.. ఇటీవల కేంద్ర మంత్రి వర్గం యూపీఎస్ విధానానికి ఆమోదం తెలిపిందన్నారు. 2025 ఏప్రిల్ 1 నుంచి అమలు చేయనున్న ఏకీకృత పెన్షన్ విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. 22న ఉద్యోగ, ఉపాధ్యాయులతో వరంగల్ జిల్లా కేంద్రంగా భారీ బహిరంగ సభ ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయుడు గోనె శ్రీనివాస్, ఉపాధ్యాయులు రమేష్, కోమల, చంద్రమౌళి, శైలజ పాల్గొన్నారు.



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

రేగొండలో..

రేగొండ: కాకతీ కదనభేరి పోస్టర్‌ను మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో రాష్ట్ర కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, జిల్లా అధ్యక్షుడు దిల్షాద్, ఉపాధ్యాయులు దేవేందర్, శ్యామ్ రెడ్డి, రామ్‌కిషన్, శారద,రంజాన్, అలీ, గీత పాల్గొన్నారు.

ఉద్యోగ పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

భూపాలపల్లి అర్బన్: రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగులకు ఇంటీరియం రిలీఫ్ (ఐఆర్)ను 15 శాతానికి పెంచి, ప్రభుత్వం పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కట్టా రాంచంద్రమూర్తి కోరారు. 'పెన్షనర్స్ డే' సందర్భంగా జిల్లా కేంద్రంలో మంగళవారం 'డీఎస్ నకారా' చిత్రపటానికి పూలమాల వేసి నివాళుర్పించారు. ఈ రోజు ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులకు పెన్షన్ రావడానికి డీఎస్ నకారా ఎంతో కృషి చేశారని ఈ సందర్భంగా రాంచంద్రమూర్తి తెలిపారు. విశ్రాంత ఉద్యోగులకు ప్రతీ నెల 1వ తేదీన పెన్షన్లు అందజేయాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా పీఆర్సీని పెంచాలన్నారు.

జూపార్క్‌కు రెండు అడవి దున్నలు



న్యూశాయంపేట: వరంగల్ జూపార్క్‌కు సోమవారం రాత్రి రెండు అడవి దున్నలు (2 సంవత్సరాల వయసు ఉన్న ఆడ, మగ బైసన్‌లు) వచ్చాయి. అధికారులు వీటిని హైదరాబాద్‌లోని నెహ్రూ జూపార్క్ నుంచి తీసుకొచ్చి ప్రత్యేక ఎన్‌క్లోజర్లలో ఉంచారు. త్వరలో సందర్శకులకు కనువిందు చేయనున్నాయి. అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ ప్రత్యేక చొరవతో ఇటీవల రెండు పులులు(కరీనా,శంకర్)లతోపాటు విశాఖ జూపార్క్ నుంచి హగ్‌డీర్‌లు(జింకలు), ప్రస్తుతం అడవి దున్నల రాకతో జూపార్క్ నూతన కళ సంతరించుకుంది. ఇక్కడి వాతావరణానికి అలవాటు పడేవరకూ సంరక్షణ చర్యలు తీసుకుంటూ రాష్ట్ర మంత్రి కొండా సురేఖ చేతుల మీదుగా సందర్శకులు వీక్షించే వీలుగా ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

టీజీఎడ్‌సెట్ నిర్వహణ బాధ్యతలు కేయూకు..

- కన్వీనర్‌గా ప్రొఫెసర్ వెంకట్రాంరెడ్డి
- టీజీఐసెట్ మహాత్మాగాంధీ యూనివర్సిటీకి..



టీజీఎడ్‌సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ వెంకట్రాంరెడ్డి

కేయూ క్యాంపస్: తెలంగాణ రాష్ట్రంలో బీఈడీ కోర్సుల్లో ప్రవేశాలకుగాను (2025–2026) ఎడ్‌సెట్ నిర్వహణ బాధ్యతలను కాకతీయ యూనివర్సిటీకి రాష్ట్ర ఉన్నత విద్యామండలి అప్పగించింది. మంగళవారం హైదరాబాద్‌లో రాష్ట్ర ఉన్నత విద్యామండలి వివిధ కోర్సుల కామన్ ఎంట్రెన్స్ టెస్టులు (2025–2026) నిర్వహించేందుకు వివిధ సెట్‌లను యూనివర్సిటీలకి అప్పగించింది. ఈ మేరకు సెట్లకు కన్వీనర్లను నియమించారు. చాలాఏళ్ల తరువాత టీజీఎడ్‌సెట్ నిర్వహణ బాధ్యతలు కాకతీయ యూనివర్సిటీకి ఉన్నతవిద్యామండలి అప్పగించింది. కన్వీనర్‌గా కాకతీయ యూనివర్సిటీ ఫిజిక్స్ విభాగం ప్రొఫెసర్ బి. వెంకట్రాంరెడ్డిని నియమించారు. కాకతీయ యూనివర్సిటీలో విద్యాకళాశాలలో రెగ్యులర్ ప్రొఫెసర్లు ఎవరు లేకపోవడంతో ఫిజిక్స్ విభాగం ప్రొఫెసర్‌ను కన్వీనర్‌గా నియమించారు. వెంకట్రాంరెడ్డి గతంలో అనేక పదవులు నిర్వర్తించారు. ప్రధానంగా కేయూ అదనపు పరీక్షల నియంత్రణాధికారిగా, పరీక్షల నియంత్రణాధికారిగా, రిజిస్ట్రార్‌గా పనిచేసిన అనుభవం ఉంది.

టీజీ ఐసెట్‌కు నో..

రాష్ట్రంలోని ఎంసీఏ, ఎంబీఏ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే టీజీ ఐసెట్ నిర్వహణ బాధ్యతలు 12 ఏళ్లుగా కాకతీయ యూనివర్సిటీకే ఉన్నత విద్యామండలి అప్పగించింది. 2024లో నిర్వహణకు సంబంధించి కేటాయించిన నిధుల ఖర్చు విషయంలో కన్వీనర్‌పై ఆరోపణలు వచ్చిన తెలిసిందే. దీంతో ఈసారి టీజీఐసెట్ నిర్వహణను మహాత్మాగాంధీ యూనివర్సిటీకి అప్పగించింది. కానీ, టీజీ ఎడ్‌సెట్ చాలా ఏళ్ల తరువాత కేయూకు వచ్చింది.

వరంగల్ రీజియన్‌కు 112 ఎలక్ట్రిక్ బస్సులు

టీజీఎస్ ఆర్టీసీ వరంగల్ రీజియన్‌కు ప్రభుత్వం, ఆర్టీసీ యాజమాన్యం 112 ఎలక్ట్రిక్ బస్సులు కేటాయించింది. ముందుగా 86 బస్సులు కేటాయించగా ఇటీవల మరో 26 బస్సులు పెంచింది. రీజియన్‌లో కాలం చెల్లిన బస్సులను తొలగించడంతో పాటు మహాలక్ష్మి పథకంతో పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్‌లకు ప్రయాణికుల రద్దీ పెరిగింది. ఈ క్రమంలో కొత్త బస్సుల కేటాయింపులో భాగంగా ఎలక్ట్రిక్ బస్సుల సంఖ్యను పెంచింది. దీంతో వరంగల్ రీజియన్‌లో బసుల కొరత తీరనుంది.



వరంగల్-2 డిపోలో సిద్ధంగా ఉన్న ఎలక్ట్రిక్ బస్సులు

రయ్..రయ్

వరంగల్ రీజియన్ పరిధిలోని రోడ్లపై పరుగెత్తనున్న ఈవీ బస్సులు

- అందుబాటులోకి చార్జింగ్ పాయింట్లు
- పూర్తయిన విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణం
- ఈ నెల 18న రోడ్లపైకి రావాల్సి ఉండగా వాయిదా
- రవాణాశాఖ మంత్రి సమయం కోసం ఎదురుచూపు
- వరంగల్ రీజియన్‌కు మొత్తం 112.. ముందుగా 86 బస్సుల కేటాయింపు

పర్యావరణహిత ఎలక్ట్రిక్ బస్సులు రోడ్లపై పరుగులు పెట్టడానికి సిద్ధంగా ఉన్నాయి. ఇందుకు అధికారులు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. ఆరు చార్జింగ్ పాయింట్లు పూర్తయిన క్రమంలో ఈ నెల 18న (నేడు) ఎలక్ట్రిక్ బస్సులు ప్రారంభించాలని నిర్ణయించారు. ఈ మేరకు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభోత్సవానికి రావడానికి సుముఖత వ్యక్తం చేసినట్లు సమాచారం. అయితే అనివార్య కారణాలతో మంత్రి కార్యక్రమం రద్దు కావడంతో ప్రారంభోత్సవం వాయిదా పడింది. మంత్రి ఇచ్చే సమయాన్ని బట్టి ప్రారంభోత్సవం ఉంటుందని ఆర్టీసీ అధికారులు తెలిపారు. వారం రోజుల్లో మంత్రి వచ్చే అవకాశముందని భావిస్తున్నారు. ఈ మేరకు ప్రారంభోత్సవానికి సన్నాహాలు చేస్తున్నారు.

– హన్మకొండ

చార్జింగ్ పాయింట్లు, సబ్‌స్టేషన్ నిర్మాణం పూర్తి..

ఆర్టీసీ వరంగల్ రీజియన్‌కు వచ్చిన, రావాల్సిన ఎలక్ట్రిక్ బస్సులను వరంగల్-2 డిపోనకు కేటాయించారు. ఎలక్ట్రిక్ బస్సులకు అవసరమైన చార్జింగ్ పాయింట్లు, సబ్‌స్టేషన్ నిర్మాణం పూర్తయింది. 112 బస్సులకు గాను వరంగల్-2 డిపోలో మొత్తం 21 చార్జింగ్ పాయింట్లు ఏర్పాటు చేయాల్సి ఉండగా పనులు వేగంగా సాగుతున్నాయి. కాగా ఇప్పటికే 6 చార్జింగ్ పాయింట్లు అందుబాటులోకి వచ్చాయి. వీటికి అవసరమై విద్యుత్ సరఫరా చేసేందుకు సబ్ స్టేషన్ నిర్మాణం వరంగల్-2 డిపోలో పూర్తయింది. 6 చార్జింగ్ పాయింట్ల ద్వారా 30 నుంచి 35 బస్సులు చార్జింగ్ చేసుకోవచ్చు. ఒక్క పాయింట్ ద్వారా రోజుకు 5 బస్సుల వరకు చార్జింగ్ చేసుకోవచ్చు. ఒక్క బస్సు పూర్తి చార్జింగ్ కావడానికి గంటన్నర నుంచి రెండు గంటల సమయం పడుతుంది. ఒక పిన్‌తో చార్జింగ్ చేస్తే 2 గంటలు, రెండు పిన్‌లతో చార్జింగ్ చేస్తే గంట సమయం పడుతుంది.



వరంగల్-2 డిపోలో సిద్ధంగా ఉన్న చార్జింగ్ పాయింట్‌లు, నిర్మాణం పూర్తయిన సబ్ స్టేషన్

రీజియన్‌కు చేరుకున్న 75 బస్సులు..

వరంగల్ రీజియన్‌కు కేటాయించిన 112 బస్సుల్లో ఇప్పటి వరకు 75 చేరుకున్నాయి. మొత్తం 112 బస్సుల్లో 19 సూపర్ లగ్జరీ, 18 డీలక్స్, 75 ఎక్స్‌ప్రెస్ బస్సులు రావాల్సి ఉండగా ఇప్పటి వరకు 75 బస్సులు రాగా ఇందులో 19 సూపర్ లగ్జరీ, 16 డీలక్స్ బస్సులు, 40 ఎక్స్‌ప్రెస్ బస్సులు ఉన్నాయి వీటి రాకతో వరంగల్ -2 డిపో కళకళలాడుతోంది. జేబీఎం సంస్థ నిర్వహణలో ఎలక్ట్రిక్ బస్సులు నడుస్తాయి. ఈ మేరకు టీజీఎస్ ఆర్టీసీతో జేబీఎం సంస్థ ఒప్పందం చేసుకుంది. జేబీఎం సంస్థ డ్రైవర్ల రిక్రూట్‌మెంట్ బాధ్యతను శ్రీబాలజీ కన్సల్టెన్సీకి అప్పగించింది. ఈ మేరకు కన్సల్టెన్సీ.. డ్రైవర్ల ఎంపిక ప్రక్రియను కొనసాగిస్తోంది. 112 బస్సులకు 260 మంది డ్రైవర్లకు గాను ఇప్పటి వరకు 136 మందిని ఎంపిక చేసి శిక్షణ ఇచ్చింది. వీరితో 50 బస్సులు నడపొచ్చు. అయితే త్వరలో 34 బస్సులు నడిపేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

'పింగిళి' ప్రిన్సిపాల్‌గా సుహాసిని బాధ్యతల స్వీకరణ



కేయూ క్యాంపస్: హనుమకొండలోని ప్రభుత్వ పింగిళి కళాశాల పుల్అడిషనల్ చార్జి (ఎఫ్ఏసీ) ప్రిన్సిపాల్‌గా డాక్టర్ జి. సుహాసిని బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఆ కళాశాల రెగ్యులర్ ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రమౌళి నెలరోజులపాటు దీర్ఘకాలిక సెలవుపై వెళ్లారు. దీంతో ఆ కళాశాల పరీక్షల నియంత్రణాధికారిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న సుహాసినిని ఎఫ్ఏసీ ప్రిన్సిపాల్‌గా నియమిస్తూ కళాశాల విద్యా కమిషనర్ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. దీంతో సుహాసిని అదే రోజు బాధ్యతలు స్వీకరించారు. స్టాఫ్‌సెక్రటరీ ఎం.అరుణ, డాక్టర్ సురేశ్ బాబు, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

పొదుపుపై అవగాహన పెంచుకోవాలి

కేయూ క్యాంపస్ : విద్యార్థి దశ నుంచే పొదుపు, పెట్టుబడులపై అవగాహన పెంచుకోవాలని కాకతీయ యూనివర్సిటీలోని కామర్స్‌అండ్ బిజినెస్‌మేనేజ్‌మెంట్ కళాశాల ప్రిన్సిపాల్ అమరవేణి అన్నారు. మంగళవారం ఆ కళాశాల సెమినార్‌హాల్‌లో సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్‌బోర్డు ఆఫ్ ఇండియా, న్యూఢిల్లీలోని ఎన్ఎస్‌డీఎల్ సంయుక్త నిర్వహణలో స్కిల్ డెవలప్‌మెంట్ ఎన్ఐఎస్ఎం సర్టిఫికెట్ కోర్సును ప్రారంభించి మాట్లాడారు. ఈ కోర్సులో ఎనిమిది ఆఫ్‌లైన్, నాలుగు ఆన్‌లైన్ తరగతులు నిర్వహిస్తామని, పూర్తిగా ఉచితమని తెలిపారు. ఈ కోర్సు పూర్తయిన అనంతరం ఉపాధి అవకాశాలుంటాయన్నారు. ఈ కోర్సు శిక్షకుడు అజయ్ ఉపాధ్యాయ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేశారు.

భూముల ఆక్రమణకు భూస్వామి కుట్ర..

- ముగ్గురు రైతుల ఆరోపణ.. ఆ భూముల వద్ద నిరసన



ఆక్రమణకు గురైన భూమి వద్ద పట్టా పుస్తకాలతో నిరసన తెలుపుతున్న రైతులు

మరిపెడ రూరల్: అక్రమంగా పట్టా పొంది తమ భూములను ఆక్రమించుకునేందుకు ఓ భూస్వామి కుట్ర చేశాడని, ఈ క్రమంలోనే హద్దురాళ్లను తొలగించి తమ భూముల్లో పాతాడని రైతులు ఆరోపించారు. ఈ మేరకు మంగళవారం ఆక్రమణకు గురైన భూముల వద్ద నిరసన వ్యక్తం చేశారు. సదరు రైతులు షేక్ రహీముద్దీన్, వుర్లుకొండ శ్రీను, నర్సయ్య కథనం ప్రకారం.. మండలంలోని గుండెపుడి శివారులో ఇద్దరి రైతులకు మూడు ఎకరాలు, ఒక రైతుకు ఐదు ఎకరాల చొప్పున సాగు భూములు ఉన్నాయి. 30 ఏళ్లుగా వారసత్వంగా వచ్చిన భూములు సాగు చేసుకుంటున్నారు. ఈ క్రమంలో వీరి భూముల వెనక గుండెపుడి గ్రామానికి చెందిన వెంకట్‌రెడ్డికి 12 ఎకరాల భూమి ఉంది. ఇటీవల ముగ్గురు భూముల మధ్య మరో 22 గుంటల భూమిని కొనుగోలు చేశాడు. అనంతరం 22 గుంటల భూమిని ఎకరం 22 గుంటలు కొన్నట్లు పత్రాలు సృష్టించి సాదాబైనామా ద్వారా పట్టాపాస్ పుస్తకం పొందాడు. 22 గుంటల భూమి పోగా ఒకరం భూమి ముగ్గురి భూముల్లో ఉందని, తన అనుచరులతో ఆ ముగ్గురి భూముల్లో హద్దురాళ్ల పాతాడు. ఇదేమిటని ప్రశ్నిస్తే మరిపెడ పోలీస్ స్టేషన్‌లో ముగ్గురిపై కేసు పెట్టి భయాభ్రాంతులకు గురి చేస్తున్నాడు. దీనిపై సంబంధిత అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని, లేని క్రమంలో ఆత్మహత్యలు చేసుకుంటామని సదరు రైతులు రహీముద్దీన్, నర్సయ్య, శ్రీను కన్నీటి పర్యంతమయ్యారు.

దర్యానాయక్‌కు ఘన నివాళి

- ముగిసిన సాయుధ పోరాట యోధుడి అంత్యక్రియలు
- నివాళులర్పించిన సీపీఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని, పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



దర్యానాయక్‌కు నివాళులర్పిస్తున్న తమ్మినేని వీరభద్రం, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

దేవరుప్పుల : తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు జాటోతు దర్యానాయక్ అంత్యక్రియలు ముగిశాయి. జనగామ జిల్లా దేవరుప్పుల మండలం ధర్మాపురం రెవెన్యూ పరిధి పడమటితండా జీపీకి చెందిన దర్యానాయక్ సోమవారం రాత్రి మృతి చెందిన విషయం విధితమే. మంగళవారం ఆయన అంత్యక్రియలు నిర్వహించగా వామపక్ష నేతలు, ప్రజాసంఘాలు, ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. సీపీఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు.. దర్యానాయక్ పార్థివదేహానికి ఘన నివాళులర్పించారు. కాగా, దర్యానాయక్ అంతిమయాత్ర సందర్భంగా వామపక్ష, ప్రజాజాసంఘాల జెండాలతో ధర్మాపురం (పడమటితండా)కు ఎరుపెక్కింది. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ నిజాం పాలనలో విస్నూరు దేశ్‌ముఖ్‌ల ఆగడాలకు సజీవదహనమైన త్యాగాల కుటుంబం నుంచి వచ్చిన ఉద్యమకెరటం దర్యానాయక్ అన్నారు. దర్యానాయక్ మృతి విప్లవోద్యమాలకు తీరనిలోటన్నారు. పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి మాట్లాడుతూ దర్యానాయక్ ఆశయ సాధన దిశలో తండాల అభివృద్ధికి తోడ్పాటు అందిస్తామన్నారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో కీలక పాత్ర పోషించిన దర్యానాయక్ స్ఫూర్తి భావితరాలకు చాటేలా ధర్మాపురంలో ఆయన స్మారక విగ్రహాన్ని ఏర్పాటు చేయిస్తానన్నారు. పోరాట యోధుడి కుటుంబానికి అండగా నిలుస్తామన్నారు. మాజీ ఎమ్మెల్యే రాజారెడ్డి మాట్లాడుతూ ఎర్ర జెండా కొదమ సింహం దర్యానాయక్ అన్నారు. కార్యక్రమాల్లో టీపీసీసీ సభ్యుడు లకావత్ లక్ష్మీనారాయణనాయక్, పార్టీ మండల అధ్యక్షుడు నల్ల శ్రీరాములు, సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి, వామపక్ష నాయకులు సింగారపు రమేశ్, బిల్లా తిరుపతిరెడ్డి, జీడి ఎల్లయ్య, వెంకట్‌రెడ్డి, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆల్ ఇండియా ప్రధాన కార్యదర్శి బి. వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

రైతు వ్యతిరేకి కాంగ్రెస్

- అన్నం పెట్టే రైతులను అరెస్టు చేయడం సిగ్గుచేటు
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు వినయ్‌భాస్కర్



వినతిపత్రంతో బీఆర్ఎస్ నాయకుల నిరసన

హన్మకొండ : రైతు వ్యతిరేక పార్టీ కాంగ్రెస్ అని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ విమర్శించారు. లగచర్ల రైతులపై అక్రమంగా కేసులు పెట్టి, వారిపై థర్డ్ డిగ్రీ ప్రయోగించి జైళ్లలో నిర్బంధించిందని, రైతులకు బేడీలు వేసిన కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ, అమానవీయ, అణిచివేత విధానాలకు నిరసనగా మంగళవారం హనుమకొండలోని బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. అదే విధంగా బీఆర్ఎస్ నాయకుడు నయిముద్దీన్ సంకెళ్లు వేసుకుని నిరసన తెలిపాడు. ఈ సందర్భంగా వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ దేశానికి అన్నం పెట్టే రైతులను అరెస్టు చేయడం సిగ్గుచేటన్నారు. రైతుబంధు బంద్ చేశారని, అర్హులైన వారికి రుణమాఫీ చేయలేదని, ధాన్యానికి ఇస్తామని చెప్పిన బోనస్ బోగస్ అయిందని, సాగు సాయానికి ఎగనామం పెట్టారని దుయ్యబట్టారు. గుండె నొప్పి వచ్చిన రైతుకు బేడీలు వేయడం అమానుషమన్నారు.35 రోజులుగా రైతులను జైలులో నిర్బంధించడం కాంగ్రెస్ రాక్షస పాలనకు నిదర్శనమని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో వ్యవసాయం పండుగ అయిందని, నేడు కాంగ్రెస్ పాలనలో దండగ వుతుందన్నారు. బీఆర్ఎస్ నాయకులు నాగుర్ల వెంకటేశ్వర్లు, మర్రి యాదవరెడ్డి, ఎల్లావుల లలితాయాదవ్, కుమార్, తాళ్లపల్లి జనార్దన్, పులి రజనీకాంత్, సోదా కిరణ్, బొంగు అశోక్ యాదవ్, కుసుమ లక్ష్మీనారాయణ, సుంచు కృష్ణ, జానకీరాములు, సా రంగపాణి, జోరిక రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభను వెలికితీసేందుకే సీఎం కప్



వర్చువల్‌లో మాట్లాడుతున్న రాష్ట్ర అటవీశాఖ మంత్రి కొండా సురేఖ



క్రీడాజ్యోతిని వెలిగించిన కలెక్టర్ సత్యశారద, అదనపు కలెక్టర్, డీవైఎస్ఓ

- రాష్ట్ర మంత్రి కొండా సురేఖ

వరంగల్: గ్రామీణ ప్రాంత యువతలోని క్రీడా ప్రతిభను గుర్తించేందుకే సీఎం కప్‌ను నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. మంగళవారం వరంగల్‌లోని ఓ సిటీ స్టేడియంలో సీఎం కప్ జిల్లా స్థాయి పోటీలను ఆమె వర్చువల్‌గా ప్రారంభించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. క్రీడాకారుడైన సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు ప్రాధాన్యతనిస్తూ, బడ్జెట్‌లో క్రీడలకు రూ.375కోట్లు కేటాయించిందన్నారు. వరంగల్ జిల్లాలోని 13 మండలాల్లోని దాదాపు 6,000 మంది క్రీడాకారులకు గ్రామీణ, మండల, మున్సిపల్ స్థాయిల్లో పలుక్రీడాంశాల్లో పోటీలు నిర్వహించి ప్రతిభ ఆధారంగా జిల్లా స్థాయికి ఎంపికచేసినట్లు తెలిపారు. పారాలింపిక్స్‌లో జాతీయ పతకాన్ని ఎగరవేసిన దీప్తి జీవంజిని యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కలెక్టర్ సత్యశారద మాట్లాడుతూ.. ఈనెల 21వ తేదీ వరకు ఓ సిటీ స్టేడియం, చింతల్ మైదానంలో 36 క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వర్చువల్‌లో రాష్ట్ర ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, 'కుడా' చైర్మన్ ఇనగాల వెంకట్రామిరెడ్డిలు మాట్లాడారు. అంతకుముందు కలెక్టర్ సత్యశారద, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీవైఎస్ఓ సత్యవాణిలతో కలిసి క్రీడాజ్యోతిని వెలిగించి పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక అధికారి బాలకృష్ణ, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ సెక్రటరీ కైలాస్‌యాదవ్, జిల్లా అధ్యక్షుడు వెంకటరమణ, కార్యదర్శి ధనరాజ్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్ దుర్మరణం


- 'టీ' కోసం రోడ్డు దాటుతుండగా ప్రమాదం..



కుమారస్వామి(ఫైల్)

గీసుకొండ: గ్రేటర్ వరంగల్ 16వ డివిజన్ ధర్మారం బస్టాండ్ వద్ద వరంగల్–నర్సంపేట రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్ దుర్మరణం చెందాడు. మృతుడి భార్య లక్ష్మి, గీసుకొండ పోలీసుల కథనం ప్రకారం.. వరంగల్ జిల్లా ఖిలావరంగల్ మండలం నక్కలపల్లికి చెందిన పసునూరి కుమారస్వామి(47) ఉదయం 4 గంటలకు ట్రాక్టర్‌లో సిమెంట్ ఇటుకలు లోడ్ చేసుకుని నర్సంపేటకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో ధర్మారం వద్ద 'టీ' తాగడానికి ఆగాడు. ట్రాక్టర్ దిగి రోడ్డుకు అవతలి వైపు ఉన్న హోటల్ వద్దకు వెళుతుండగా వరంగల్ వైపునకు వెళ్తున్న గూడ్స్ వాహనం ఢీకొంది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన కుమారస్వామి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఈ ఘటనలో కారు డ్రైవర్ రామకృష్ణపై మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు గీసుకొండ ఇన్‌స్పెక్టర్ మహేందర్ తెలిపారు.

'నూరేండ్ల నా ఊరు'పై గ్రూప్-2లో ప్రశ్న



ప్రశ్నపత్రం



వరంగల్ శ్రీనివాస్

నర్సంపేట: ప్రముఖ సినీ, గేయ రచయిత, కవి వరంగల్ శ్రీనివాస్‌కు సంబంధించిన 'నూరేండ్ల నా ఊరు' గేయ కావ్యాన్ని రాసినవారు ఎవరని సోమవారం జరిగిన గ్రూప్–2 పరీక్షలో ప్రశ్న వచ్చింది. వరంగల్ శ్రీనివాస్.. వంద సంవత్సరాల పూర్వం పల్లెల్లో మానవ జీవన విధానం గురించి ప్రపంచానికి తెలియజేయడానికి 243 చరణాల గేయ కావ్యాన్ని రచించారు. ఈ గేయానికి 'నూరేండ్ల నా ఊరు'గా నామకరణం చేశారు. ఈ కావ్య గాత్రం కోసం తెలుగు రాష్ట్రాల్లోని 243 మంది గాయకుల ఎంపిక చేశారు. ఈ క్రమంలో 'నూరేండ్ల నా ఊరు' కావ్యాన్ని ఆవిష్కరించనున్న నేపథ్యంలో గ్రూప్–2 పరీక్షలో ప్రశ్న రావడంపై ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశమైంది.

తమ్ముడి మరణం తట్టుకోలేక అన్న ఆత్మహత్య

- బెగ్లూరులో ఘటన

కాళేశ్వరం: తమ్ముడి మరణం తట్టుకోలేక అన్న ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మహదేవపూర్ మండలం బెగ్లూరులో జరిగింది. ఎస్సై పవన్‌కుమార్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పొట్లపల్లి మధునయ్య (34) తమ్ముడు రామచంద్రం మూడు నెలల క్రితం అనారోగ్య కారణాలతో మృతి చెందాడు. అప్పటి నుంచి మధునయ్య తన తమ్ముడిని గుర్తు చేసుకుంటూ బాధపడుతుండేవాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసయ్యాడు. మంగళవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడాడ్డు. ఈ ఘటనపై మృతుడి భార్య మహేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పవన్ కుమార్ తెలిపారు.

పాకాలలో బోటింగ్‌కు సై!



పాకాల సరస్సులో ట్రయల్ రన్ నిర్వహిస్తున్న బోటింగ్

- ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు
- మరింత పెరుగనున్న పర్యాటకుల సంఖ్య

ఖానాపురం: ప్రకృతి అందాలకు నెలవు పాకాల. చుట్టూ అభయారణ్యం .. మధ్యలో కొండలు.. కొండల మధ్యలో సరస్సు.. సర్సస్సులో బోటింగ్. ఈ ప్రకృతి సుందర అందాలను వర్ణించలేం. వీటిని వీక్షించడానికి పర్యాటకులు ఉమ్మడి వరంగల్‌తోపాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి పాకాల విచ్చేస్తారు. ఆహ్లాదకర వాతావరణంలో పాకాల అందాలు వీక్షిస్తుంటారు. అనంతరం బోటింగ్ సైతం చేసి సంతోషంగా గడుపుతారు. అయితే కానీ కొద్ది సంవత్సరాల నుంచి బోటింగ్ నిలిచిపోవడంతో పర్యాటకులు అసహనం వ్యక్తం చేసేవారు. ఈ నేపథ్యంలో పర్యాటకుల అభీష్టం మేరకు రాష్ట్ర అటవీ శాఖ ఆధ్వర్యంలో బోటింగ్‌ను మళ్లీ అందుబాటులోకి తీసుకొస్తున్నారు. ఇప్పటికే రెండు బోట్లు, జెట్టిని తీసుకొచ్చారు. త్వరలోనే ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా సరస్సులో పలుమార్లు బోటింగ్ ట్రయల్ రన్‌ను చేపట్టారు. కాగా, పెద్దలకు రూ.50, పిల్లలకు రూ.30తో పాటు స్పీడ్ బోట్‌లో రూ.350తో అందుబాటులోకి తీసుకురానున్నట్లు అధికారులు తెలుపుతున్నారు. బోటింగ్ అందుబాటులోకి వస్తే మళ్లీ పర్యాటకులు ఆనందంగా గడపడానికి అవకాశం ఉంటుంది.